అంగన్‌వాడీలా!

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇరుకు గదులు, అరకొర సౌకర్యాలు
- అర్బన్‌లో అన్నీ అద్దె భవనాలే

ఇచ్ఛాపురం రూరల్:

అంగన్‌వాడీ కేంద్రాలు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడి నుంచే చక్కటి సేవలు అందించడంతో పాటు చిన్నారులకు ప్రీ స్కూల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమై దాదాపుగా 40 ఏళ్లు గడిచినా నేటికి అక్కడక్కడా సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడం, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన పక్కా భవనాల నిర్మాణం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. ఇచ్ఛాపురం అర్బన్ పరిధిలో ఉన్న 70 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తుండడం గమనార్హం. ఇచ్ఛాపురం మండలాల్లో పాడుబడ్డ భవనాలు, రేకుల షెడ్డుల్లో కేంద్రాలు నిర్వహిస్తుండటంతో వర్షా కాలం వచ్చిందంటే చాలు గదులు కారిపోతున్నాయి. అసౌకర్యాలతో కూడిన అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పక్కా భవనాల కొరత పట్టి పీడుస్తోంది. దీంతో చిన్నారుల సైతం బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ లేక అపరిశుభ్రంగా తయారయ్యాయి.



బుడ్డేపువేటలో రేకుల షెడ్డులో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కేంద్రాలు:	సొంత భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు:	అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు:	అద్దెలేని కేంద్రాలు:
154	12	104	39

చిన్నారులు ఇబ్బంది..

అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు అవసరమైన గాలి, వెలుతురు సరిగ్గా లేని ఇరుకు గదులు ఉండటంతో చిన్నారులతో పాటు కార్యకర్తలు, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. చాలా చోట్ల నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేదు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు ఉండే అద్దె భవనాలకు రూ.750 నుంచి వెయ్యి రూపాయల వరకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తుండగా, అర్బన్ ప్రాంతంలో అన్ని సౌకర్యాలు ఉండే భవనాలకు రూ.6 వేలు వరకు అద్దె చెల్లిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలని, కొత్త భవనాలను మంజూరు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మరికొన్ని చోట్ల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అధికారుల ఆదేశాలు మేరకు నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

– పురాణం నాగరాణి, సీడీపీఓ, ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ



దమయంతిని పరామర్శిస్తున్న శ్రీనివాస్

కోటబొమ్మాళి: కిష్టుపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త చల్ల అప్పలరాజు భార్య దమయంతిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. పార్టీ మీకు అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కిష్టుపురం సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, పార్టీ నాయకులు దుక్క రామక్రిష్ణ, ఉర్జాన విశ్వనాథం ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: ఈ నెల 3, 4, 5, 7 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళంలో జరగనున్న అథ్లెటిక్స్ క్రీడాంశంలో అండర్–17 విభాగం షాట్‌పుట్‌కి ఎంపికైన కె.మదన్, అమలాపురంలో జరగనున్న క్రికెట్ పోటీల్లో అండర్–14 విభాగంలో ఎంపికైన ఎం.జగన్‌లను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు టి.గణేష్, శారద పాల్గొన్నారు.

రూ. 60 వేల విరాళం



హెచ్‌ఎంకు చెక్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: చదువుకున్న బడి అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు డైనింగ్ హాల్ నిర్మాణం కోసం రూ.60 వేలు కేటాయించారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని చెక్ రూపంలో ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో ప్రతీ పూర్వ విద్యార్థి భాగస్వామ్యం కావాలని కోరారు.

సమస్యల ఏకరువు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సమస్యల్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ సీఎం చంద్రబాబు ముందు ఏకరువు పెట్టారు. వంశధార జలాలను బాహుదా నదికి అనుసంధానించాలని, బాహుదాలో గ్రోయిన్స్ మరమ్మతులు చేయాలని, అప్పటివరకు నియోజకవర్గంలో చిన్ననీటి వనరులకు యంత్రాలతో పూడిక తీసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఈదుపురంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, కోకోనట్ పార్కును ఏర్పాటు చేయాలని, తిత్లీ తుఫానులో పాడైన ఎన్టీఆర్ సుజలధార ప్రాజెక్టు పునరుద్ధరించాలని, కిడ్నీ బాధితులకు అవసరమైన డయాలసిస్ బెడ్స్ సంఖ్య పెంచాలని, బెంతొరియాలకు నేటివిటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు.

మాజీ మంత్రి సీదిరికి తిలక్ పరామర్శ



అప్పలరాజును పరామర్శిస్తున్న తిలక్

కాశీబుగ్గ: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పరామర్శించారు. అప్పలరాజు ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న తిలక్ గురువారం పలాసలో అప్పలరాజు నివాస గృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

వైభవంగా కాళికాదేవి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న కాళికాదేవి

కవిటి: స్థానిక కాళీమాత ఆలయం వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కాళికాదేవిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఏడాదిలో ఒక రోజు కాళికావేషధారణకు వినియోగిస్తున్న ముఖఅలంకారాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు చేయడం ఈ ఉత్సవంలో సంప్రదాయంగా వస్తోందని అర్చకుడు మోహన్ తెలిపారు. 12గంటలపాటు నిరంతరాయంగా భజన కాలక్షేపం నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

టోల్‌గేట్ వద్ద సాంకేతిక సమస్య!



నిలిచిపోయిన కంటైనర్‌లు

కాశీబుగ్గ: జాతీయ రహదారిపై ఉన్న పలాస మండలం లక్ష్మీపురం టోల్ ప్లాజా వద్ద శుక్రవారం సాంకేతిక సమస్య తలెత్తింది. కంప్యూటర్లతో పాటు ఆన్‌లైన్ సిస్టం పనిచేయలేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆన్‌లైన్ లావాదేవీలతో పాటు సర్వర్ పూర్తిగా పనిచేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో టోల్‌ప్లాజా సాంకేతిక సిబ్బంది ప్లాజాలో ఉన్నటువంటి ఆన్‌లైన్‌తో పనిచేసే అన్ని విభాగాలను రీస్టార్ట్ చేశారు. అయినప్పటికీ టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే లైన్– 04 హ్యాంగ్ అవ్వడంతో అదే దారిలో వెళ్లే ఫాస్టాగ్ సిస్టం నిలిచిపోయి రెడ్ మార్కులోకి వచ్చేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరుస క్రమంలో వచ్చిన వాహనాలు ఒకదాని వెనుక మరొకటి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు 40 నిమిషాల తరువాత సమస్య పరిష్కారం కావడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి



నౌపడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో రఘువర్మ

సంతబొమ్మాళి: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనకు ఓటు వేసి గెలిపించాలని శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ కోరారు. మర్రిపాడు, నౌపడ, సంతబొమ్మాళి పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలైన 117 జీవో రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెండింగ్ డీఏల పరిష్కారం, ఐఆర్, నూతన పీఆర్‌సీ ప్రకటనపై పోరాటం చేస్తానన్నారు. సంతబొమ్మాళి పీఆర్‌టీయూ 257 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, బాలక చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సావు రామారావు, తాతం నాయుడు, జయకృష్ణరెడ్డి, సంతోష్, బాలరాజు, రాము పాల్గొన్నారు.

ఇందిరమ్మకు ఘనంగా నివాళి



ఇందరమ్మకు నివాళులర్పించే కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు

టెక్కలి: భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆశయాలు, సంస్కరణలే దేశానికి శరణ్యమని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం టెక్కలిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న కాలంలో చేసిన సంస్కరణలతో బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో ప్రయోజనాలు కలిగాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధుసూదనరావు, నాయకులు టి.బి.జె.గుప్తా, పి.ఆనంద్, డి.ఉమామహేశ్వరరావు, పి.మాధవరావు, కె.శంకర్‌ప్రసాద్, ఎస్.ధర్మారావు, జి.కృష్ణ, సరోజని, పి.సూర్యనారాయణ, డి.వెంకట్రావు ఉన్నారు.

గౌరీదేవి ఉత్సవాలకు మాజీ మంత్రికి ఆహ్వానం



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల గ్రామంలో శనివారం నిర్వహిస్తున్న గౌరీదేవి పూజా మహోత్సవంలో పాల్గొనాలని కోరుతూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు చినంచల ఎంపీటీసీ సభ్యులు బమ్మిడి దుర్యోధనరావు ఆధ్వర్యంలో గురువారం ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పానిల శ్రీనివాసరావు, ఉంగ సాయిక్రిష్ణ, పైల వెంకటరావు, సనపల సింహాచలం, గొర్లె వేణుగోపాలరావు ఉన్నారు.

అమరజీవి శ్రీరాములు కృషి నిరుపమానం



కవిటి: శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న రామారావు



వజ్రపుకొత్తూరు రూరల్: అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు



కంచిలి: శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: స్వర్ణభారతి విద్యా సంస్థల్లో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్ర ఆవతరణకు చేసిన కృషి నిరుపమానమైనదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కొత్తపుట్టుగలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును జాతీయస్థాయిలో ఘనంగా వినిపించి తన ప్రాణాలు అర్పించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్రంగా సాధించిపెట్టిన అమరజీవి శ్రీరాములు మనందరికీ ఆరాధ్యనీయులని అన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్షతో ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని దోకులపాడు సర్పంచ్ వడ్డి సరిత కరుణాకర్, ఎంపీటీసీ సభ్యురాలు కొయిరి భాగ్యలక్ష్మి అన్నారు. దోకులపాడులో ప్రేరణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి ఆశయాలను ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రేరణ యూత్ క్లబ్ అధ్యక్షుడు పుక్కళ్ల ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు మద్దు యుగంధర్, కార్యదర్శి ఎస్.పుష్పన్న, కె.వెంకటజోగారావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు యంపల్ల పాపారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొయిరి ఢిల్లేశ్వరరావు, పోలయ్య ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని స్వర్ణభారతి విద్యా సంస్థల్లో నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వెలకట్టలేనిదని, ఆయన ఆంధ్రుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని విద్యాసంస్థల అధినేత చాట్ల తులసీదాసురెడ్డి అన్నారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంచిలి: ఆంధ్రరాష్ట్రం అవతరణ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ యు. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌ఎస్ఎస్ పీవో నరసింహదాస్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లు రద్దు చేయాలి

టెక్కలి: ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో నీటి తీరువా వసూళ్లు రద్దు చేయాలని మేధావుల ఫోరం అధ్యక్షుడు జి.వి.రెడ్డి మాస్టారు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆరంభంలో వర్షాలు కురిసినప్పటికీ శివారు ప్రాంతాలకు సాగు నీరు అందని పరిస్థితి ఉందన్నారు.

9, 10 తేదీల్లో సీపీఎం మహాసభలు



మాట్లాడుతున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: సీపీఎం జిల్లా మహాసభలు పలాసలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్నాయి. వీటిని విజయవంతం చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు బమ్మిడి అనందరావు శుక్రవారం తెలిపారు. కార్మిక, కర్షకుల సమస్యలపై సీపీఎం నిరాంతరం పోరాటం చేస్తోందన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను నేడు ప్రైవేటీకరణ చేసి వాటిని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలకు జీవనాధారంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్రం విరమించుకోవాలన్నారు. వంశధార శివారు భూములకు సాగు నీరు అందించాలని, వరి, జీడి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. నాయకులు ఎస్.మోహన్, టి.చంద్రయ్య, టి.భాస్కరరావు, బి.రామకృష్ణ ఉన్నారు.

రిటైర్డు హెచ్‌ఎంకు సత్కారం



మధుసూదనరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పలాస: సూదికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గున్న మధుసూదనరావు దంపతులను సిబ్బంది, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ప్రమేచందు, విద్యాకమిటీ చైర్మన్ పైల తులసి, ప్రధానోపాధ్యాయులు గోరు రేణుక, ఉపాధ్యాయులు పద్మకుమారి, హేమలత, సంధ్య, నవ్య, ఆశాలత, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెట్టొద్దు



రైల్వేస్టేషన్ వద్ద ప్రచారం చేస్తున్న దృశ్యం

కంచిలి: బాలకార్మికులను పనుల్లో పెడితే చట్టరీత్యా నేరమని మండల విద్యాశాఖాధికారి–2 కె.చిట్టిబాబు అన్నారు. మండల కేంద్రంలో చైల్డ్ లేబర్ రెస్క్యూ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వ్యాపార సముదాయాలు, మెకానిక్ షాపులు, వెల్డింగ్ షాపులు, కాష్యూ ఇండస్ట్రీస్‌ని తనిఖీ చేశారు. 18 సంవత్సరాలు కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలతో పని చేయించడం నేరమన్నారు. అలా చేయించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని లేబర్ ఆఫీసర్ లేబర్ ఆఫీసర్ మట్ట విజయకుమార్ వివరించారు. చైల్డ్ లైన్ ప్రతినిధి ఎం.సునీత, బ్రెడ్స్ సంస్థ ప్రతినిధి స్వాతి, హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు!



మామిడిపల్లిలో పింఛన్ల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

పలాస: పింఛన్ల కోసం వయోవృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు శుక్రవారం పడిగాపులు కాయాల్సి వచ్చింది. గంటల తరబడి నిరీక్షించారు. పలాస మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. సర్వర్ డౌన్ కారణంగా ఈ పరిస్థితి నెలకొందని ఉద్యోగులు చెప్పారు. ఇంటింటికీ ఉదయం ఆరు గంటలకు వెళ్లి ఇవ్వాల్సిన పింఛన్లను సాయంత్రం వరకు గ్రామాల్లో ఒక చోటకి చేర్చి అందజేశారు.

వైభవంగా కాళీమాత ఉత్సవం



కాళీమాత ఉత్సవంలో భక్తజనం

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలో కాళీమాత ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు ఏటా దీపావళి పర్వదినాన నిర్వహించే ఈ ఉత్సవాలకి జనం పోటెత్తుతారు. కాళీమాత కు ముడ్రాటలు, మొక్కులు సమర్పించేందుకు మహిళలు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జి.వసంతరా వు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కె.గోపా ల్, జి.రామారావు, బి.శ్రీనివాసరావు, పి.దుర్యోధనరావు, కోనేరు రాజు ఉన్నారు.

కార్మికుడు కుటుంబానికి ఆర్థిక సాయం



కవిత పాత్రోకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసకు చెందిన జీడి కార్మికుడు దామోదర్ పాత్రో అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెదడులో సమస్య తలెత్తడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పలాస కాష్యూ లేబర్ అండ్ రైస్ మిల్లర్స్ యూనియన్ సభ్యులు రూ.20 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని దామోదర్ భార్య కవిత పాత్రోకు శుక్రవారం అందజేశారు. యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెలుగుల పండుగ

వెలుగుల పండుగ దీపావళిని ప్రజలు ఉత్సాహంగా గురువారం రాత్రి జరుపుకున్నారు. సంప్రదాయబద్ధంగా ఇళ్లల్లో మహాలక్ష్మీ పూజలు చేశారు. అనంతరం చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా అందరూ తారాజివ్వలు, చిచ్చుబుడ్లు, మతాబులు, కాకర్లు, భూచక్రాలు, కాకరపువ్వులు, వివిధ బాంబులను కాలుస్తూ సందడి చేశారు. ప్రజాప్రతినిధులు కూడా బాణసంచాను కాలుస్తూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. మార్వాడీ కుటుంబీకులు ఇళ్లు, వ్యాపార సంస్థలను అరటిచెట్లు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. బాణసంచా వెలుగులతో పల్లెలు, పట్టణాలు మెరిసిపోయాయి.

–సాక్షి నెట్‌వర్క్



కాశీబుగ్గ: పలాసలోని నూతన గృహంలో దీపావళి జరుపుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబసభ్యులు



కోటబొమ్మాళి: నిమ్మాడలో టపాసులు పేల్చుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



కవిటి: కొత్తపుట్టుగలో దీపావళి వేడుకల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు



కాశీబుగ్గ: దీపావళి వేడుకలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులు



కాశీబుగ్గలో వ్యాపార సముదాయాన్ని పచ్చని చెట్లతో అలంకరించుకున్న మార్వాడీలు



వజ్రపుకొత్తూరు రూరల్: మతాబులు కాల్చుతున్న దృశ్యం



కాశీబుగ్గ: బాలసదనంలో దీపావళి సంబరాల్లో చిన్నారులు, గ్రీన్‌ఆర్మీ సభ్యులు